


స్నో.. స్లో.. స్లో..

చలి తీవ్రత పెరగడంతో తెల్లవారుజామున దట్టంగా పొగమంచు అలుముకుంటోంది. వాహనదారులు లైట్లు వేసుకొని స్లోగా వెళ్తున్నారు. జాతీయ రహదారి కావడంతో తెల్లవారు జామున నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఉదయం 9 గంటల వరకు పొగమంచు ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. హెడ్‌లైట్స్ వేసుకొని వెళ్తున్నారు. పొగమంచు కారణంగా సోమారం రోడ్డులో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. రెండు వాహనాల్లో ఉన్న వారికి గాయాలయ్యాయి. అత్వెల్లి జగన్నాథ ఆలయంలో చలి తీవ్రత వల్ల దేవుళ్లు చలికి వణుకుతున్నారని పూజారులు శాలువాలు కప్పారు. -మేడ్చల్




కేశవరెడ్డి సేవలు మరువలేనివి



అన్నదానంలో బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకుడు దివంగత నేత నారెడ్డి కేశవరెడ్డి మేడ్చల్‌కు చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన కేశవరెడ్డి సంస్మరణ సభను మేడ్చల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించి ఆయన పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. సభ అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగన్‌గౌడ్, ఆంజనేయులు, ప్రేంకుమార్, రాఘవరెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పూజలో అభిషేకం చేస్తున్న తోటకూర వజ్రేశ్ యాదవ్, రాహుల్‌యాదవ్

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. గ్రామంలోని మల్లన్న ఆలయం వద్ద ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ నిర్వహించిన పడి పూజలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి పడి వెలిగించారు. పడిపూజలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ నాగమణి, మండల నాయకులు పాల్గొని అభిషేకం చేశారు. స్వాములు, భక్తుల అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. పూజలో గురుస్వాములు శ్రీనివాస్ యాదవ్, రాము, మల్లారెడ్డి, రాజు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పొగమంచు ప్రమాదానికి కారణం



పొగమంచు కారణంగా బోల్తా కొట్టిన వ్యాన్

మేడ్చల్‌రూరల్: పొగమంచు కారణంగా డీసీఎం వ్యాన్ బోల్తా కొట్టడంతో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్ఐ లావణ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సోమారం గ్రామానికి వెళ్లే దారిలో బుధవారం ఉదయం మేడ్చల్ వైపు వస్తున్న డీసీఎం వ్యాన్ పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న మరో వాహనం దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో వ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వ్యాన్ బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

– మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



విద్యుత్ సమస్యలను తెలుసుకుంటున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో విద్యుత్ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సతీశ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ కేబుళ్లను సరిచేయాలని, ఇనుప విద్యుత్ స్తానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

పోచారం చెరువులో మహిళ ఆత్మహత్య

పోచారం: మానసిక ఆందోళనతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ వి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఎల్లంకి భాస్కర్ తన భార్య లావణ్య(37), కూతురు శ్రీజ(18), కొడుకు అశ్విత్(14)తో కలిసి పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌లో అద్దె ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. శ్రీజ ఎంబీబీఎస్ చదువుతోంది. ఈమెకు మూర్చ వ్యాధి ఉండటంతో ఎంబీబీఎస్ చదవొద్దని తల్లి చెప్పింది. అయినప్పటికీ శ్రీజ చదువు మానలేదు. దీంతో తల్లి మానసిక ఆందోళనకు గురైంది. ఇదిలా ఉండగానే ఈ నెల 25న భాస్కర్ తన కుటుంబ సభ్యులతో వేములవాడ గుడికి దైవదర్శనం కోసం వెళ్లారు. 26న సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకుని, భోజనం చేసి అందరూ నిద్రపోయారు. తెల్లవారుజామున భాస్కర్‌కు మెళకువ వచ్చింది. ఆ సమయంలో భార్య కనిపించలేదు. పరిసర ప్రాంతాలు గాలించగా పోచారం చెరువు వద్ద ఆమె మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గీత పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడిగా పాండుగౌడ్

మల్లాపూర్: అశోక్‌నగర్ గీత పారిశ్రామిక సహకారం సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బింగి పాండుగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎల్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి పోలగోని సంజీవగౌడ్, డైరెక్టర్లుగా భీమగోని క్రిష్టయ్య, భీమగోని భిక్షపతి ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్, మేడ్చల్ జిల్లా సీనియర్ కో ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, పి.రాజవర్ధన్ ప్రకటించారు. నూతన కమిటీ ఐదేళ్లు కొనసాగుతుంది. ఈ సందర్భంగా బింగి పాండుగౌడ్ మాట్లాడుతూ గీతా పారిశ్రామిక సంఘం సభ్యుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

‘ప్రజా పాలన’కు సర్వం సిద్ధం

వచ్చే నెల 6 వరకు ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

- నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లుగా జిల్లాస్థాయి అధికారులు
- మండలాల్లో పర్యవేక్షకులుగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు
- 13 పురపాలక సంఘాలు, 61 జీపీల్లో సభల నిర్వాహణకు 306 టీమ్‌లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజలకు పాలన చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు నిర్వహించనున్న ‘ప్రజా పాలన’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా, నిర్ణీత వ్యవధిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఆరు గ్యారంటీల్లో భాగంగా అందజేసేందుకు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించే గ్రామ పంచాయతీలు, వార్డు/డివిజన్ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ సెలవు దినాలు మినహాయించి మిగతా ఎనిమిది రోజుల్లో ప్రతిరోజూ రెండు షిఫ్టుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులు/డివిజన్లలో ప్రజాపాలన సభలు జరిగేలా అధికార యంత్రాంగం కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించింది. క్షేత్రస్థాయిలో జవాబుదారితనం, పారదర్శకతతో కూడిన మెరుగైన పరిపాలనను ప్రజాభిప్రాయానికి అనుగుణంగా అందించడమే లక్ష్యంగా నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా జిల్లా యంత్రాంగం రూపకల్పన చేసింది.

ఈ పథకాలకు మాత్రమే.. దరఖాస్తుల స్వీకరణ..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో నిర్వహించే సభలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకం, యువ వికాసం తదితర పథకాలకు అర్హులైన ప్రజల నుంచి సంబంధిత అధికారులు దరఖాస్తులు తీసుకుంటారు. సభల్లో దరఖాస్తుల స్వీకరణ కోసం మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలతో పాటు కౌంటర్లను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. భారీ సంఖ్యలో దరఖాస్తుదారులు ఉన్నట్లయితే.. టోకెన్ విధానాన్ని అధికారులు అనుసరిస్తారు.

నియోజకవర్గాలకు స్పెషల్ ఆఫీసర్లు..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పురపాలక సంఘాల్లో సభల విజయవంతానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి జిల్లాస్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. అందులో భాగంగానే మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా జెడ్పీ సీఈఓ దేవసహాయం, ఉప్పల్‌కు యువజన, క్రీడా విభాగం అధికారి బలరామారావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురామ్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీని నియమించారు. ఈ స్పెషల్ ఆఫీసర్లు తమ నియోజకవర్గం పరిధిలోని గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల్లో సభలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటారు. సభలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తారు.

సభల సక్సెస్‌కు 306 టీమ్‌లు

ప్రజాపాలన సభలు సక్సెస్ కావడానికి జిల్లా అధికార యంత్రాంగం 306 టీమ్‌లను నియమించింది. జిలాల్లోని 61 గ్రామ పంచాయతీల్లో సభలకు నిర్వహణకు 10 టీమ్‌లను ఖరారు చేసిన అధికార యంత్రాంగం.. 13 పురపాలక సంఘాల పరిధిలోని 289 వార్డులు/డివిజన్లలో సభలు నిర్వహించేందుకు 296 టీమ్‌లను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘాల్లో సభల సక్సెస్ కోసం మండల తహసీల్దార్లు, గ్రామ పంచాయతీల్లో సభల విజయవంతానికి ఎంపీడీఓలు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

సాయి గీతాశ్రమంలో పూజలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయి గీతాశ్రమంలో బుధవారం మహాగణపతి హోమం నిర్వహించారు. ఆశ్రమ ఉత్తరాధికారి కీర్తిమా ఆధ్వర్యంలో వేద పండితులు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హోమంలో పాల్గొన్నారు. గురువారం సాయి సహిత సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పుట్టినరోజు శుభాకాంక్షలు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఎమ్మెల్సీ కవితను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అదేవిధంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు.


కలెక్టర్‌కు ఆటో యూనియన్ నాయకుల వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మేడ్చల్: ఆటో డ్రైవర్లకు నెలకు నిరుద్యోగ భృతి కింద ప్రభుత్వం రూ.15 వేలు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందని, వారిని ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మారయ్య, విజయారావు, గోపాల్ తదితరులు ఉన్నారు.

మేడ్చల్‌లో అయ్యప్ప స్వామి ఊరేగింపు



మేడ్చల్: అయ్యప్ప అలయం తెరిచి పూజలు మొదలై మండల రోజులు(41) పూర్తి కావడంతో మేడ్చల్ అయ్యప్ప దేవాలయంలో బుధవారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి నందారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి సాయంత్రం అయ్యప్పను మేడ్చల్ పట్టణ వీధుల్లో ఊరేగించి రాత్రి పడిపూజ నిర్వహించారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి, స్వాములు నృత్యాలు చేస్తూ భజనలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. గురుస్వాములు రాజేశ్వరగుప్తా, క్రిష్ణమూర్తి స్వామి, అనిల్, నర్సింహస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పంబారట్టు



అయ్యప్ప స్వామికి అభిషేకం చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: పోచారంలోని శివాలయం వద్ద అయ్యప్ప స్వామికి పంబారట్టు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని స్వామి వారికి అభిషేకం చేశారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. అనంతరం ఎస్వైఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు సామల యాదిరెడ్డి, సామల సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, సింగిరెడ్డి, సాయిరెడ్డి, నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి, బద్దం జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం



మల్లాపూర్: నాచారం డివిజన్ అభివృద్ధి పనులపై బుధవారం ఇంజనీరింగ్ అధికారులతో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సమీక్షించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జిని త్వరగా ప్రారంభించాలన్నారు. శాంతి గార్డెన్స్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణ పనుల కోసం శంకుస్థాపనకు సిద్ధం చేయాలని కోరారు. వార్డు కార్యాలయం నుంచి ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్, ఎర్రకుంట వరకు మంజూరైన సీసీ రోడ్డు పనులు, హనుమాన్ నగర్‌లో సామాజిక భవనం, అంబేద్కర్ యువజన భవనం ప్రారంభించేందుకు సమాయత్తం చేయాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి



మేడ్చల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి



గుండ్లపోచంపల్లిలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



జవహర్‌నగర్‌లో ప్రజాపాలన అవగాహన సదస్సు

మేడ్చల్: ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అందించనున్న ఆరు గ్యారంటీ పథకాల అమలుకు గురువారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి అవగాహన కల్పించారు. భోజన సమయం మినహా ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ విజయానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

మేడ్చల్‌రూరల్: ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, టీం లీడర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 15 వార్డుల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ డ్వాక్రా భవన్‌లో బుధవారం ప్రజాపాలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కమిషనర్ రామలింగం, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ప్రజాపాలనను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్, అంగన్‌వాడీ, డ్వాక్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీసర మండలంలో..

కీసర: అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తు ఫారాలను తీసుకునేందుకు గురువారం నుంచి ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గ్యామనాయక్ తెలిపారు. మొదటిరోజు బుధవారం రాంపల్లిదాయర, భోగారం, 29న గోధుమకుంట, అంకిరెడ్డిపల్లి, 30న కరీంగూడ, యాద్గార్‌పల్లి, వచ్చేనెల 2న తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, 3వ తేదీన చీర్యాల, కీసర గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.

కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకునేవిధంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు కృషిచేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కేంద్రాల వద్ద మున్సిపల్ కార్యాలయం నుంచి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపత్రిప్రణీతాగౌడ్ అన్నారు. కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన అనసూయ(85) కనిపించడం లేదని పోచారం పోలీస్ స్టేషన్‌లో ఆమె కొడుకు పరుశురాం ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9390872432 నంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.

బీఆర్ఎస్ నేత నుంచి ప్రాణహాని

శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



బాధితుడు బాబు

శామీర్‌పేట్: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరుడు మూడుచింతలపల్లి బీఆర్ఎస్ నేత నీరజ్‌గౌడ్‌తో తనకు ప్రాణహాని ఉందని మూడుచింతపల్లికి చెందిన ఓ బాధితుడు శామీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కొత్త బాబు మీడియాతో మాట్లాడుతూ తాను కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగుతున్నానని, దీంతో మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల నీరజ్‌గౌడ్ తనను కాంగ్రెస్ పార్టీ వీడి బీఆర్ఎస్‌లో చేరాలని కొంతకాలంగా వేధిస్తున్నాడని తెలిపారు. ఈ నెల 17న తాను హోటల్ సరుకుల కోసం నగరానికి వెళ్లగా తాను లేని సమయంలో నీరజ్‌గౌడ్ తన హోటల్ సిబ్బందిని బెదిరించాడని, ఇటీవల తనపై అసభ్యపదజాలం, కులం పేరుతో దూషించాడని, మండలానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో తనను కులం పేరుతో దూషిస్తూ మానసికంగా వేదిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై తాను శామీర్‌పేట్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేశానని, సదరు వ్యక్తికి మల్లారెడ్డి అండదండలు ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేయడం లేదని ఆరోపించారు. పోలీసులకు తనకు న్యాయం చేయాలని కోరాడు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు రెడ్డికాలనీలో సుమారు రూ.3 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన స్థానిక కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



కీసర: నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ముప్పు ఎల్లారెడ్డి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముప్పు రాంరెడ్డి, మాజీ ఎంపీపీ చిన్నమరాజు ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.